క్లుప్తంగా

చాగంటి ప్రవచనాలతో ప్రజల్లో పెరిగిన ఆధ్యాత్మికత



అమలాపురంలో కోటేశ్వరరావు పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తున్న భక్తులు

అమలాపురం టౌన్: చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు టీవీల్లో, సోషల్ మీడియాల్లో చూస్తున్న ప్రజల్లో ఆధ్యాత్మికత పెరిగిందని జిల్లా కార్పెంటర్ల చేతి వృత్తుల వారి సంఘం అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి అన్నారు. స్థానిక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం జరిగిన ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు పుట్టిన రోజు వేడుకల్లో సూర్యనాయణమూర్తి మాట్లాడారు. భక్తుల ఆధ్వర్యంలో జరిగిన చాగంటి పుట్టిన రోజు వేడుకల్లో మిఠాయిలు పంచిపెట్టి వేడుక జరిపారు. చాగంటి ప్రవచనాలు పామరులకు సైతం అర్థమయ్యే రీతిలో ఉండి వారిలో ఆధ్యాత్మిక నింపుతున్నాయని పలువురి భక్తులు పేర్కొన్నారు. చివరగా చాగంటి పుట్టిన రోజును కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో భక్తులు బచ్చు ప్రభాకరం, దాట్ల వెంకట సుబ్బరాజు, మాగంటి రామకృష్ణ, ఆకే కృష్ణమూర్తి, కంచర్ల రామకృష్ణ, గున్నేపల్లి భీమశంకరం తదితరులు పాల్గొన్నారు.

తాచు పాము హల్‌చల్



చినగాడవిల్లిలో పామును పట్టుకున్న స్నేక్ క్యాచర్ వర్మ

ఉప్పలగుప్తం: చినగాడవిల్లి గ్రామంలో మార్కెట్ ప్రాంతంలో ఆరున్నర అడుగుల భారీ తాచు పాము హల్‌చల్ చేసింది. కల్యాణం నరసింహం ఇంటి ఆవరణలో ఉన్న కోళ్ల గూటిలోకి తాచుపాము ప్రవేశించి అందరినీ భయభ్రాంతులకు గురి చేసింది. ఆ నివాసితులు స్నేక్ క్యాచర్ జంపన గణేష్ వర్మకు సమాచారం అందించగా ఆయన వచ్చి చాకచక్యంగా పామును బందించారు. ఆ పాముకు సుమారు 60 సంవత్సరాల వయస్సు ఉంటుందని, ఇటువంటి భారీ పాములు అరుదుగా ఉంటాయని వర్మ తెలిపారు. పామును పట్టుకోవడంతో అక్కడి ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

లక్ష్మీగణపతికి పూజలు

అమలాపురం టౌన్: పట్టణంలోని భూపయ్య అగ్రహారంలో ఉన్న లక్ష్మీగణపతి స్వామి ఆలయం 42వ వార్షికోత్సం వేడుకలు సోమవారం వైభవంగా జరిగాయి. ఆషాఢ బహుళ చతుర్ది సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సోమవారం స్వామివారి గరక పూజ కన్నుల పండువగా సాగింది. భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ పేరి కొండబాబు ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు జరిగాయి.

కనకదుర్గమ్మకు సారె సమర్పణ



శాకంబరి అలంకరణలో కనకదుర్గమ్మ

యానాం: పట్టణ పరిధిలో ఉదయకృష్ణవంశీ కాలనీలో ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారికి సోమవారం మహిళలు ఆషాఢం సారె సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారిని శాకంబరి అలంకరణలో తీర్చిదిద్ది గ్రామ ఆడపడుచులతో వివిధ రకాల పిండివంటలు, చలివిడి, పానకం, వడపప్పు తదితర పదార్థాలతో సారెను బహూకరించారు. యానాం, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పూజలు నిర్వహించారు. గ్రామ యువత, ఆలయ కమిటీ పాల్గొన్నారు.

పేదరికం లేని సమాజం కోసం కృషి

కాట్రేనికోన: రాష్ట్రంలో పేదరికం లేని సమాజం కోసం టీడీపీ ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కాట్రేనికోన గ్రంధి నాగేశ్వరరావు కల్యాణ మండపంలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంనాయకులు, కారకర్తల సమావేశం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సమావేశానికి అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్, పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యంతో పాటు మంత్రి కొల్లు రవీంద్ర హాజరయ్యారు. పల్లంలో కార్యక్రమం జరిగింది.

ఉద్యానవనం.. అధ్వానం

- పార్కు నిర్మించిన ఏడేళ్లకే శిథిలం
- విరిగిపోయిన వినోదం, ఆట పరికరాలు
- వాకింగ్ ట్రాక్‌పై నడవాలంటే భయం..భయం
- ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు
- అమలాపురంలో పార్కులపై మున్సిపాలిటీ వివక్ష

అమలాపురం టౌన్: పట్టణంలోని మున్సిపాలిటీ వాటర్ వర్క్సుకు అతి సమీపంలోనే రెండు తాగునీటి రిజర్వాయర్ల (చెరువులు) చుట్టూ నిర్మించిన ఆరోగ్య ఉద్యానవనం (పార్కు) నిర్మించిన ఏడేళ్లకే శిథిలావస్థకు చేరుకుంది. పార్కులో అనేక అసౌకర్యాలు తిష్ట వేయడంతో ఆ పార్కును వినియోగించుకునే సందర్శకుల సంఖ్య క్రమేపీ తగ్గుతోంది. మున్సిపాలిటీ 26, 27 వార్డుల పరిధిలో ఉండే ఈ పార్కు అభివృద్ధిపై మున్సిపాలిటీ నిర్లక్ష్యం వహిస్తోంది. నిర్వహణ సక్రమంగా లేక పార్కుకు వచ్చే సందర్శకులు సమస్యలతో సతమతమవుతున్నారు.

నాలుగు ప్రధానమైన పార్కుల్లో నిత్యం రద్దీ

మున్సిపాలిటీలో నాలుగు ప్రధానమైన పార్కులుంటే చంద్రబాబు ఉద్యానవనం, డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు ఉద్యానవనం, మున్సిపల్ పిల్లల పార్కు, కాటన్ పార్కులను నిర్వహిస్తోంది. మున్సిపాలిటీ ఒక్క డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు ఉద్యానవనం (పార్కు) అభివృద్ధికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి మిగిలిన పార్కులపై వివక్ష చూపుతోందన్న విమర్శలు ఉన్నాయి. మున్సిపాలిటీలో మరో మూడు పార్కులున్నా అవి చిన్నస్థాయిలో ఉండడంతో మున్సిపాలిటీ వాటిపై పెద్దగా దృష్టి పెట్టకపోయినా ప్రజల నుంచి అభ్యంతరాలు అంతగా ఉండవు. నిత్యం సాయంత్రం అయిందంటే చాలు వందలాది సందర్శకులతో చెరువుల వద్ద పార్కు నిండిపోతుంది. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలను దగ్గరుండి తీసుకుని వచ్చి ఈ పార్కులో ఉన్న వినోద పరికరాలతో ఆడిస్తారు. ఇప్పుడు ఆ వినోద పరికరాలు తుప్పు పట్టి కొన్ని, శిథిలమై విరిగిపోయి, మరికొన్ని పనికి రాకుండా నిరుపయోగంగా మారాయి.

2018లో ప్రారంభమై

తాగునీటి రిజర్వాయర్ల వద్ద చంద్రబాబు ఉద్యానవనం 2018లో రూపు దిద్దుకుంది. అప్పటి ప్రభుత్వం దాదాపు రూ. 2 కోట్ల వ్యయంతో ఈ పార్కును నిర్మించి, అట్టహాసంగా ప్రారంభించారు.



సిమెంట్ బల్లలుల లేకుండా అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీ



అస్తవ్యస్తంగా పార్కులోని పరిసరాలు



పార్కులో వర్షం నీరు



పార్కులో శిథిలమైన బొమ్మలు, లవ్ సింబల్‌తో ఉన్న అమలాపురం ఆంగ్ల అక్షరాలు

అప్పటి డిప్యూటీ సీఎం, హోంశాఖ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప ఈ పార్కును ప్రారంభించారు. నిర్మించి ఏడేళ్లకే పార్కులోని పరికరాలు శిథిలావస్థకు చేరుకోవడంతో ఆ పరికరాల నాణ్యతపై ఇప్పుడు ప్రజలు అనుమానిస్తున్నారు. ఈ వినోద పరికరాలు, అరుదైన మొక్కలను బయట ప్రాంతాల నుంచి దిగుమతి చేసి అప్పట్లో మున్సిపల్ పాలకులు వీటి గురించి గొప్పగా చెప్పారు. ఏడేళ్లకే నాణ్యతాలోపాలతో పరికరాలు, ఆట వస్తువులు, జంతువుల శిల్పాలు శిథిలావస్థకు చేరుకోవడం ప్రస్తుతం చర్చనీయాంశమైంది.

పిల్లలకు గాయాలు

పార్కులు వినోద వస్తువులు కొన్ని తుప్పు పట్టడంతో ఆడుకుంటున్న ఓ పిల్లలకు గాయాలవుతున్నాయి. డ్రెయినేజీ నిర్వహణ సక్రమంగా లేదు. డ్రెయిన్‌పై ఎలాంటి బల్ల లేకపోవడంతో ఓ బాలుడు ఇటీవల ఆ డ్రెయిన్‌లో పడి గాయపడ్డాడు. ఆరునెలల కాలంలో ఇటువంటి ఘటనలు అనేకం చోటుచేసుకున్నాయి. పార్కు ప్రారంభ సమయంలో అమలాపురం అనే ఇంగ్లీషు అక్షరాలను లవ్ సింబల్‌తో అందంగా, ఆకర్షణీయంగా అమర్చారు. ఇప్పుడు ఆ అక్షరాలు కూడా శిథిలమై నేలన పడ్డాయి. ఇటీవల పట్టణంలో ఈదరపల్లి పంట కాలువపై వంతెన నిర్మాణంతో తలెత్తిన తాగునీటి కష్టాల్లో భాగంగా పార్కు ఉన్న రెండు రిజర్వాయర్లలో ఒక దానిలోని నీరు అడుగంటి అందులోని చేపలు చనిపోవడంతో తాగునీటి శుభ్రతపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. వర్షం కురిసిన తర్వాత పార్కుల్లో సంచరించేందుకు సందర్శకులు వెనకడుగు వేస్తున్నారు. పార్కులో పలు చోట్ల వర్షం నీరు చేరి బురదమయంగా మారుతోంది.

పాముల సంచారంపై వాకర్స్ భయాందోళన

ముఖ్యంగా రిజర్వాయరు చుట్టూ వాకర్ల కోసం నిర్మించిన వాకింగ్ ట్రాక్ చెంతనే ఉన్న చంద్రబాబు పార్కు నిర్వహణ సక్రమంగా లేక పిచ్చి మొక్కలు, తుప్పలు పెరిగిపోవడంతో వాకర్స్‌లో పాముల భయం పట్టుకుంది. పలుమార్లు పాములు కనిపించడంతో వాకర్స్ ఆ ట్రాక్‌పై నడవాలంటేనే తల్లడిల్లిపోతున్నారు. పిల్లలు ఆడుకునే ఆట పరికరాలు జారుడు బల్ల తదితర పరికరాలు తప్పు పట్టి శిథిలావస్థకు చేరుకున్నాయి. పిల్లల వినోదం కోసం ఏర్పాటు చేసిన గుర్రం తదితర బొమ్మలు విరిగిపోయాయి.

కలెక్టర్‌కు ఫిర్యాదుతో కొద్ది కదిలిక

రెండు వారాల కిందట ఈ పార్కులోని వాకింగ్ ట్రాక్‌ను వినియోగించే వాకర్లు కలెక్టర్‌కు నేరుగా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. మున్సిపల్ అధికారులకు పార్కు దుస్థితిని అనేక పర్యాయాలు వివరించి విసుగు చెందిన వాకర్లు కలెక్టర్‌కు విన్నవించారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో వాకింగ్ ట్రాక్ విషయంలో కొద్ది కదిలక మొదలైంది. వాకింగ్ ట్రాకింగ్ వెంబడి పేరుకుపోయిన పిచ్చి మొక్కలు, తప్పలను మున్సిపల్ సిబ్బంది జంగిల్ క్లియరెన్స్ పేరుతో తొలగిస్తున్నారు. గతేడాది కిందట ఈ పార్కుకు అభివృద్ధి కోసం రూ.20 లక్షల నిధులను కేటాంచినా నేటి వరకూ ఆ పనులకు టెండర్ల ప్రక్రియను చేపట్టలేకపోయారు. ఇటీవల కొత్తగా వచ్చిన మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్ ఈ పార్కు అసౌకర్యాల పట్ల ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది. కలెక్టర్‌కు ఫిర్యాదుతో ప్రస్తుతం పార్కులో పేరుకుపోయిన పిచ్చి మొక్కల తొలగింపునకు మోక్షం కలిగినట్టే పార్కులోని మిగతా అసౌకర్యాలు, సమస్యలను పరిష్కరించాలని పట్టణ ప్రజలు, పార్కు సందర్శకులు, వాకర్లు విజ్ఞప్తి చేస్తున్నారు.

పుంత రోడ్డుకు మోక్షం



విలసవిల్లి వడ్డివారిపేట ప్రాంతంలో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి

ఉప్పలగుప్తం: విలసవిల్లి గ్రామంలో దళిత ప్రజలు నివసించే ప్రాంతమైన వడ్డివారిపేట నుంచి భీమ్‌నగర్‌కు ఉన్న పుంత మార్గానికి రహదారి మోక్షం కల్పిస్తున్నామని సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి అన్నారు. గ్రామంలో వడ్డివారిపేట ప్రాంతంలో జరుగుతున్న గ్రావెల్ రోడ్డు పనులను సోమవారం ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి రోడ్డు మార్గం లేక ఆ ప్రాంత ప్రజలు గ్రామపంచాయతీ, రేషన్ దుకాణాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో సులువుగా ఉండే విధంగా రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్ పాల్గొన్నారు.

రాంబాబుకు సత్కారం



రాంబాబును దుశ్శాలువాతో సత్కరిస్తున్న సర్పంచ్ శ్రీదుర్గ

ఉప్పలగుప్తం: మండల మహిళా విభాగ అధ్యక్షురాలుగా గొల్లవిల్లి గ్రామ సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబును చల్లపల్లి ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలసి దుశ్శాలువాతో సత్కరించారు. పదవీ బాధ్యతలు చేపట్టిన శ్రీదుర్గను రాంబుబు అభినందించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జొన్నాడ చిన్నీ, చప్పిడి సాయిబాబు, ఉప్పలగుప్తపు ఈశ్వరావు, జినిపే గంగరాజు, పరమట మురళీ తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు దోహదపడతాయి



ఉపాధ్యాయ నాయకత్వ లక్షణాలపై శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు

కాట్రేనికోన: పాఠశాల నిర్వాహణలో ఉపాధ్యాయుల నాయకత్వ లక్షణాలు దోహద పడతాయని జిల్లా విద్యాశాఖ అధికారి డా.షేక్ సలీం బాషా, సమగ్ర శిక్ష ఏపీసీ జి.మమ్మిలు పిలుపునిచ్చారు. చెయ్యేరు శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఉపాధ్యాయుల నాయకత్వ లక్షణాలు నాలుగు రోజులు శిక్షణా తరగతులు డీఈఓ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకుని, విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేవిధంగా బోధన ఉండాలన్నారు. స్వీయ అవగాహన, నిర్వాహణ, పాఠ్యాంశాల బోధన, అభ్యసన, సంస్కృతిని ప్రోత్సహించడం, పరిశీలన, ఆర్థిక వనరుల నిర్వాహణ వంటి అంశాలపై శిక్షణ అందించారు. జిల్లా వ్యాప్తంగా 650 మంది ప్రధానోపాధ్యాయులకు మూడు విడతలలో శిక్షణ అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ సెంటర్ కోఆర్డినేటర్ ఏఎంఓ పి.రాంబాబు, భీమారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పొన్నాడ జన్మదిన వేడుకలు





పల్లంకుర్రులో మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ జన్మదిన వేడుకలు జరుపుకొంటున్న నాయకులు, కాట్రేనికోన వేడుకల్లో నాయకులు

కాట్రేనికోన: ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ జన్మదిన వేడుకలు సోమవారం కాట్రేనికోనలో ఘనంగా జరుపున్నారు. గ్రామ సర్పంచి గంటి వెంకట సుధాకర్ స్వగృహం రామస్వామి తోటలో ఆయన అధ్యక్షతన వేడుకలను జరుపుకొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా నరసింహమూర్తి కేక్‌ను కట్ చేసి కార్యకర్తలకు పంచారు. నాయకులు, కార్యకర్తలు కేక్‌ను, స్వీట్స్ పంచుకున్నారు. ఈ సందర్భంగా నల్లా నరసింహమూర్తి మాట్లాడుతూ సీఎస్ఆర్, జలజీవనమిషన్ నిధులతో ముమ్మిడివరం నియోజకవర్గంలో సుమారు 110 మంచి నీటి ఓవర్ హెడ్ ట్యాంకులు, మంచి నీటి ప్రాజెక్టులు నిర్మించి దాహార్తి తీర్చారన్నారు. పల్లంకుర్రులో సర్పంచి నాతి అలివేణి అధ్యక్షతన పొన్నాడ జన్మదిన వేడుకలు జరుపుకొన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాతి సత్యనారాయణ కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కందికుప్పలో సర్పంచి చల్లగల వెంకట లక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన పొన్నాడ జన్మదిన వేడుకల్లో కేక్‌ను సీనియర్ నాయకులు ఏడిది సుబ్బారావు కట్ చేశారు. ఈ కార్యక్రమంలో చల్లగల అప్పారావు, అంగాని పెదరాజు, వాశంశెట్టి శ్రీనివాసరావు, వడ్డి శ్యామ్ ప్రసాద్, వరసాల చిన్నారావు, కాశి హనుమంతరావు, కాశి భరత్, గిడ్డ శ్రీనివాస్, నల్లా రాంబాబు, జగడం బాలయ్య, జిటి వెంకటేశ్వరరావు, సాపే సూర్య ప్రకాష్, తదితరులు ఉన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వంటా వార్పు

ముమ్మిడివరం: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ నగర పంచాయతీలో పని చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు సమ్మెలో భాగంగా సోమవారం వంట వార్పు కార్యక్రమం నిర్వహించి నిరసన తెలిపారు. గత సమ్మెకాలపు ఒప్పందాల ప్రకారం జీఓ నెం.36ను అనుసరించి జీతాలు పెంచాలని, ప్రభుత్వలో ఇప్పటివరకు రెండు దఫాలు చర్చలు జరిగినప్పటికీ న్యాయం జరగలేదని, ప్రభుత్వం స్పందించకపోవడంతో సమ్మెకు దిగామన్నారు. వీధి దీపాలు నిర్వహణ, తాగునీరు సరఫరా నిలుపుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.శ్రీనివాస రావు, ఎస్.అజయ్‌కుమార్, వి.వెంకటేశ్వరులు, జి.రమేష్, వై.రమణ, జి.వెంకటేశ్వరరావు, కే.శ్రీనివాస రావు, వి.ప్రసాద్ కే.శివ తదితరులు పాల్గొన్నారు



వంటా వార్పు కార్యక్రమం నిర్వహించి నిరసన తెలుపుతున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

ఏవో ధర్మప్రసాద్ సేవలు ప్రశంసనీయం

అమలాపురం రూరల్: మండల వ్యవసాయ శాఖ అధికారిగా పని చేసిన కడలి ధర్మప్రసాద్ సేవలు ప్రశంసనీయమని రెడ్డిపల్లి సర్పంచ్ కరాటం రత్న ప్రసన్న ప్రవీణ్ కొనియాడారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇటీవల అంబాజీపేట మండలం బదిలీ అయిన ఏవో ధర్మ ప్రసాద్‌కు రెడ్డిపల్లి పంచాయతీలో సోమవారం సన్మాన సభ నిర్వహించారు. ఏవోకు శాలువ పూలమాలలతో ఘన సత్కరించారు. సర్పంచ్ రత్న ప్రసన్న ప్రవీణ్ మాట్లాడుతూ మండల వ్యవసాయ శాఖ అధికారిగా ధర్మ ప్రసాద్ పని చేసినంత కాలం రైతులకు ఉత్తమ సేవలు అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కరాటం సూర్య భాస్కర్ రావు, కొలిశెట్టి జయప్రకాష్, సచివాలయ ఉద్యోగులు గణపతి, నెల్లి వెంకటలక్ష్మి, మహేష్, దొరబాబు, ఎన్.సతీష్ తదితరులు పాల్గొన్నారు



ఏవో ధర్మ ప్రసాద్‌ను సత్కరిస్తున్న సర్పంచ్ రత్న ప్రసన్న ప్రవీణ్

అభివృద్ధి పనులకు నిధుల మంజూరు

యానాం: నియోజకవర్గ పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు ఆదిద్రావిడశాఖ, ఎమ్మెల్యే ల్యాడ్ నిధులు మొత్తం రూ.7కోట్లు మంజూరైనప్పటికి వర్క్‌ఆర్డర్ ఇవ్వడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని దీంతో పనులు ముందుకు కదలడంలేదని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అన్నారు. సోమవారం స్థానిక పరిపాలనా విభాగం కార్యాలయంలో ఆయన లోకల్ అడ్మినిస్ట్రేటివ్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ శక్తి వేలుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట్లాది రూపాయలు నిధులు వచ్చినప్పటికీ వర్క్ ఆర్డర్‌కు సంబంధించిన ఫైలుకు మోక్షం లభించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గ పరిధిలో పనులు వేగవంతం కావాలంటే తక్షణం సంబంధిత ఫైల్‌ను పరిశీలించి దానికి ఆమోదం తెలపాలన్నారు. అదే విధంగా కనకాలపేట పాత డంపింగ్ యార్డు వద్ద ఉన్న చెత్తను పూర్తిగా రీసైక్లింగ్ చేసి తొలగించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ స్కూల్లో చదివితే 10 శాతం రాయితీ

యానాం: నియోజకవర్గంలో యానాం, పుదుచ్చేరి, మాహే, కారైకల్ రీజియన్లలో ప్రభుత్వ స్కూల్స్‌లో చదివే విద్యార్థులకు మెడిసిన్‌తో పాటు అన్ని కోర్సుల్లో 10 శాతం రిజర్వేషన్‌ను అమలు చేస్తున్నట్టు సోమవారం ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం నీట్ స్కోర్ ఆధారంగా ఎంబీబీఎస్, ఆయుర్వేద కోర్సులకు పది శాతం కోటా అమలు చేస్తున్నారని కాని అన్ని కోర్సులకు అమలు చేయాలని సీఎం రంగసామి ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ ఏడాది నుంచే కోటాను అమలు చేస్తారని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో సెంటాక్ ఇప్పటికే నాన్‌నీట్ కోర్సులకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించి ర్యాంకులను సైతం వెల్లడించింది. అయితే పది శాతం కోటా రిజర్వేషన్ ప్రకటనతో ప్రభుత్వ స్కూల్స్ విద్యార్థులు నాన్‌నీట్ కోర్సుల్లో దానిని అమలు చేస్తుందీ లేనిదీ చెప్పడం లేదు. దీంతో విద్యాశాఖ మంత్రి నమశ్శివాయం సెంటాక్ అధికారులతో సమావేశమయ్యారు.

జోరుగా మట్టి అక్రమ రవాణా

- రాత్రి వేళల్లో గుట్టుచప్పుడు కాకుండా తరలింపు
- ఎన్‌హెచ్ నేమ్‌బోర్డు ధ్వంసం అయినా పట్టించుకోని యంత్రాంగం

తాళ్లరేవు: మట్టి అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా రాత్రి వేళల్లో అక్రమార్కులు గుట్టుచప్పుడు కాకుండా మట్టిని తవ్వి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ అక్రమార్కులు చెలరేగిపోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా మండల పరిధిలోని లచ్చిపాలెం గ్రామం వద్ద జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఒక స్థలాన్ని గత 20 రోజులుగా మట్టితో పూడుస్తున్నారు. రాత్రివేళల్లో మట్టిని డంప్ చేసి చదును చేస్తున్నారు. కనీసం ల్యాండ్ కన్వర్షన్ కూడా చేయకుండా మట్టిని పూడ్చివేస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం రాత్రి రహదారి చెంతన ఉన్న ఎన్‌హెచ్ బోర్డును సైతం ధ్వంసం చేసి మట్టి పూడ్చివేత కార్యక్రమం చేసినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. దీనిపై స్థానిక వీఆర్వో శ్రీనుబాబును ప్రశ్నించగా మట్టి పూడ్చివేతకు సంబంధించి ఎటువంటి అనుమతులు తీసుకోలేదని, ఈ విషయాన్ని తహసీల్దార్ పితాని త్రినాధరావు దృష్టికి తీసుకువెళ్లానని, అనుమతులు తీసుకోకుంటే వేసిన మట్టిని సీజ్ చేస్తామని హెచ్చరించినట్టు తెలిపారు.



లచ్చిపాలెం వద్ద మట్టిని పూడ్చే క్రమంలో నేమ్ బోర్డును ధ్వంసం చేసిన అక్రమార్కులు



నాలుగు రోజుల క్రితం అదే స్థలంలో మట్టిని డంప్ చేసిన దృశ్యం

మంత్రి జాన్‌కుమార్ ప్రమాణ స్వీకారం

సత్కరించిన యానాం ఎమ్మెల్యే అశోక్

యానాం: పుదుచ్చేరి కేబినెట్ మంత్రిగా కామరాజ్‌నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే జాన్‌కుమార్ సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కె.కైలాషనాథన్ జాన్‌కుమార్‌తో ప్రమాణస్వీకారం చేయించారు. అంతకుముందు నామినేటెడ్ ఎమ్మెల్యేలుగా నియమించిన తీపైన్‌థాన్, జీఎస్ఎస్ రాజశేఖరన్, సెల్వంవేలాయుధంలతో స్పీకర్ ఆర్ సెల్వం ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన జాన్‌కుమార్‌ను యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా నామినేటెడ్ ఎమ్మెల్యేలను సైతం ఆయన ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎం రంగసామి, స్పీకర్ సెల్వం, హోంమంత్రి నమశ్శివాయం, డిప్యూటీ స్పీకర్ రాజవేలు, ఎన్ఆర్ కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.



మంత్రి జాన్‌కుమార్‌ను సత్కరించిన ఎమ్మెల్యే అశోక్

బహిష్కరించిన కాంగ్రెస్, డీఎంకే

ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని కాంగ్రెస్, డీఎంకే పార్టీలు బహిష్కరించాయి. కామచ్చి అమ్మన్ ఆలయ భూ ఆక్రమణ కేసులో కుమార్ పేరు బయటకు వచ్చినందున ఆయనను మంత్రిగా చేర్చుకోవడంపై వివాదం ఉందని, అందుకే కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్టు వారు తెలిపారు.

మత్తుకు దూరంగా ఉండాలి

అమలాపురం రూరల్: విద్యార్థులు మత్తు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అమలాపురం తాలూకా ఎస్సై శేఖర్‌బాబు ఉద్బోధించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అమలాపురం తాలూకా పోలీసుల ఆధ్వర్యంలో తాండవపల్లి యూపీ పాఠశాల, వన్నెచింతలపూడి హైస్కూల్లో సోమవారం డ్రగ్స్ వద్దు బ్రో అనే ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



బాధితులకు సాయం అందిస్తున్న సత్యనారాయణ, అశోక్ ప్రసాద్ తదితరులు

అమలాపురం రూరల్: ఇటీవల కామనగరువు అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కుంచె శాంతమ్మ, వాసంశెట్టి పెద్ది రాజు కుటుంబాలకు జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సాయం అందింది. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశాల మేరకు క్రాస్ సొసైటీ చైర్మన్ కోరుకొండ సత్యనారాయణ (ఢిల్లీ నారాయణ) తహసీల్దార్ పి.అశోక్ ప్రసాద్ చేతుల మీదుగా వంట సామగ్రి, టార్పాలిన్, రగ్గు, బియ్యం, కూరగాయలు, దుస్తులను సోమవారం బాధితులకు అందించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జాయింట్ ట్రెజరర్ జల్లి సుజాత, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు బీవీ హనుమంతరావు, ఓ బాలరాజు, పట్నాల రమణ, శేఖర్, బి.శివరాం, సర్పంచ్ నక్క అరుణకుమారిశేఖర్, వీఆర్వో భాస్కర బాలాజీ, గ్రామ పెద్దలు రాజులపూడి భాస్కరరావు, బి.నరసింహారావు, బొల్లంగి శ్రీను, వీరంశెట్టి పాల్గొన్నారు.